క్లుప్తంగా

సాగు ఖర్చులపై నియంత్రణ అవసరం



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

శాంతిపురం: వివిధ పంటల సాగులో రైతులు అవసరం మేరకే ఎరువులు, రసాయన మందులు వాడుతూ ఖర్చులను నియంత్రించుకోవాలని మండల వ్యవసాయాధికారి అప్పోజి అన్నారు. మంగళవారం సొన్నేగానిపల్లె పంచాయతీ గుండిశెట్టిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వివిధ అంశాలను వివరించారు. అనంతరం రైతులతో కలిసి బొప్పాయి, రా గి, వేరుశనగ పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానవన, సెరికల్చర్, జడ్‌బీఎస్ ఎఫ్ సిబ్బంది. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో చందం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో వ్యాయామోపాధ్యాయుడు లోకనాథం

కుప్పం రూరల్: కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో చందం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు ప్రధానోపాధ్యాయులు మార్కొండనాయుడు చెప్పారు. అండర్ -17 యోగా పోటీల్లో ఝాన్సీరాణి, రంజిత, హారతి ప్రతిభ చాటారని, అలాగే షాట్‌పుట్‌లో కార్తీక్, డిస్కు త్రోలో జయప్రియ, 600 మీటర్ల పరుగు పందెంలో హారతి, 400 మీటర్ల పరుగు పందెంలో శకుంతల విజయం సాధించినట్లు చెప్పారు. గెలుపొందిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు లోకనాథంను టీచర్లు అభినందించారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన



రోగులకు పరీక్షిస్తున్న వైద్యులు, సిబ్బంది

పలమనేరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్, జిల్లా మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వాణి కళాశాల ఆవరణలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. దాదాపు 510మందిని కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులు పరీక్షించారు. వీరిలో 25మందిని కంటి ఆపరేషన్లకు, 75మందిని ఇతర ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు జయశంకర్, కార్యదర్శి రవి, పూగొండి, సభ్యులు, మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లెకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు శ్రీనివాసులు గౌడు(75) మంగళవారం హఠాన్మరణం చెందారు. ఆయన భౌతికకాయానికి జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, సర్పంచ్ వెంకటేష్, పలువురు నాయకులు నివాళులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తాజా ఆహారంతోనే ఆరోగ్యం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ

బైరెడ్డిపల్లి: తాజా ఆహార పదార్థాలు తీసుకోవడం వలన ఆరోగ్యవంతంగా ఉంటారని సీడీపీఓ మాధవీలత అన్నారు. మండలంలోని కడపనత్తంలో మంగళవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, పండ్లు, గుడ్లు వంటి పోషకాహారం ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగు

వి.కోట: వి.కోటలో డెంగీ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య, పంచాయతీ అధికారులు అప్రమత్తమై పారిశుధ్యం పనులను వేగవంతం చేశారు. అలాగే డెంగీ, విషజ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సోమ వారం రాత్రి పంచాయతీ అధికారులు దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. సర్పంచ్ పీఏ స్ లక్ష్మి, ఈఓ శివశంకర్, వార్డు సభ్యులు పర్యవేక్షించారు.

మట్టి బకాసురులు

- చెరువులను దోచేస్తున్న టీడీపీ చోటా లీడర్లు
- పట్టించుకోని ఇరిగేషన్, ఎంపీడీఓలు



పలమనేరు మండలం బొమ్మిదొడ్డి సమీపంలోని చెరువులో జేసీబీతో మట్టిని తోడుతున్న దృశ్యం

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పచ్చ తమ్ముళ్ల అక్రమాలకు అంతులేకుండా పోయింది. చెరువుల పాలిట బకాసురులయ్యారు. అవురావురుమని మట్టిని ఆరగిస్తున్నారు. పగలూ, రాత్రీ అనే తేడా లేకుండా జేసీబీలతో నిత్యం వేలాది లోడ్ల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అధికారుల సాక్షిగా ఇదంతా జరుగుతున్నా తమకేమీ సంబంధం లేనట్టు చోద్యం చూస్తున్నారు. కేవలం పలమనేరు నియోజకవర్గంలోని పలు చెరువుల నుంచే నిత్యం వెయ్యిలోడ్ల మట్టి తరలిపోతోందంటంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. టీడీపీ శ్రేణుల మట్టి దందాపై ప్రజలు మండిపడుతున్నారు.

మట్టిని తరలిస్తున్న చెరువులు మచ్చుకు కొన్ని..!

పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని బొమ్మిదొడ్డి సమీపంలోని చెరువులో ఇటీవల పచ్చనేత అవతారం ఎత్తిన ఓ యువనేత రోజూ యాభై ట్రాక్టర్ల దాకా మట్టిని జేసీబీలతో ఎత్తి పట్టణంలోని ఇళ్లకు, వెంచర్లకు యథేచ్ఛగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నాడు. ఇదే మండలంలోని మొరం గ్రామ సమీప చెరువుల్లో ఆ పంచాయతీకి చెందిన అక్కడి లోకల్ టీడీపీ లీడర్లు సైతం సేమ్ టు సేమ్ ఇదే లెవెల్లో మట్టి స్వాహా చేస్తున్నారు. ఇక పట్టణ సమీపంలోని పలు చెరువుల్లో ఈ తంతు నిత్యం సాగుతూనే ఉంది.

- మండల కేంద్రమైన బైరెడ్డిపల్లె పెద్దచెరువులో కేజీఎఫ్ గనుల్లాగా జేసీబీలు, ట్రాక్టర్లు మట్టిని వేలాది లోడ్లను తోలేస్తున్నారు. నిమిషానికి ఓ లోడు చొప్పున ఇక్కడ మట్టిని తరలిస్తున్నారంటే చెరువులను ఎంతగా కుళ్లబొడిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.
- పెద్దపంజాణి మండలం రాయలపేట పంచాయతీ చెన్నారెడ్డిపల్లె చెరువులో కూటమికి చెందిన ఓ ముస్లిం నేత పక్కనే ఉన్న వెంచర్లకు హిటాచీతో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో తోలేస్తున్నాడు. ఈ దందా ఈ చెరువుల్లోనే కాదు నియోజకవర్గంలో మొత్తం చిన్న, పెద్ద చెరువులు 700 దాకా ఉండగా సగం చెరువుల్లో ఇప్పటికే మట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది.



బైరెడ్డిపల్లె పెద్ద చెరువులో మట్టి అక్రమ రవాణా దృశ్యం



పలమనేరు మండలం మొరం పెద్ద చెరువులో ఇదీ పరిస్థితి

ట్రాక్టర్‌ను ఆపితే పచ్చనేతల బెదిరింపులు

సాధారణంగా మేజర్ చెరువులపై ఇరిగేషన్ శాఖ, మైనర్ చెరువులు, కుంటలపై ఆయా మండలాల ఎంపీడీఓలు, సంబంధిత పంచాయతీల కార్యదర్శుల కు అజమాయిషీ ఉంటుంది. వీరే చెరువులను పర్యవేక్షించాల్సి ఉంది. అయితే కళ్లెదుటే మట్టిని తరలిస్తున్నా వారు పట్టించుకోవడం లేదు. వాటిని సీజ్ చేసి జరిమానా విధించే అధికారం ఉన్నా చేష్టలుడిగి చూస్తున్నారు. ఒకవేళ ఏ ట్రాక్టర్‌నైనా నిలిపి ప్రశ్నించినా పచ్చనేతల నుంచి వారికి బెదిరింపులు వస్తున్నట్టు సమాచారం. దీంతో ఎందుకొచ్చిన గొడవ? కళ్లు మూసుకుని ఉద్యోగం చేస్తే పోలా..?అనే ధోరణిలో వదిలేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. జిల్లా అధికారులైనా చెరువుల మట్టి అక్రమ రవాణాకు చెక్ పెట్టి, చెరువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక తవ్వకాలకు బ్రేక్

- ట్రాక్టర్లు, జేసీబీలు అదృశ్యం
- కౌండిన్య నదిలో కనిపించని ఇసుకాసురులు
- నది వద్ద నాగమంగళం గ్రామస్తుల నిఘా

సాక్షి ఎఫెక్ట్..



పలమనేరు సమీపంలోని కౌండిన్య నదిలో ఆగిన ఇసుక తవ్వకాలు, కనిపించని కూలీలు ట్రాక్టర్లు

పలమనేరు: పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్ద కౌండిన్య నదిలో మంగళవారం ఇసుకతవ్వకాలు ఆగిపోయాయి. ఇక్కడి ఇసుక తవ్వకాలపై పక్కనే ఉన్న నాగమంగళం గ్రామస్తులు ఇసుకాసురులను అడ్డుకోవడం..దీనిపై సోమవారం సాక్షి దినపత్రికలో ×ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు₹ శీర్షికతో కథనం ప్రచురించింది. దీనిపై జిల్లా అధికారుల ఆదేశాలతో స్థానిక అధికారులు దాడులకు సమాయత్తమయ్యారు. అయితే ఈ విషయం లీక్ అవడంతో ఇసుకాసురులకు నదిలోకి రాకుండా పోయినట్టు తెలిసింది. అలాగే, ట్రాక్టర్లు, జేసీబీలు అక్కడి నుంచి అదృశ్యమయ్యాయి. అక్రమంగా ఇసుక తవ్వకం, రవాణాలో గంగవరం మండలానికి చెంది కొత్తగా టీడీపీలోకి చేరిన ఓ నేత ఇన్‌చార్జిగా మారినట్టు ఆపార్టీ శ్రేణులే చెబుతున్నాయి. ఇక మున్సిపాలిటీకి చెందిన ఓ మైనారిటీ నాయకుడు తన కుమారుడిని ఇసుక అక్రమ రవాణాకు ఇన్‌చార్జిగా పెట్టి, కౌండిన్య సమీపంలోని మరో సీనియర్ టీడీపీ నేత కొబ్బరితోటలో భారీగా ఇసుకను డంప్ చేసి, రాత్రుల్లో కర్ణాటకకు తరలిస్తున్నట్టు మంగళవారం వెలుగుచూసింది. దీనిపై జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుకు సమాచారం చేరవేసినట్టు తెలిసింది. కౌండిన్య నది ప్రాంతానికి ఇసుకాసురులు, జేసీబీలు ఇతరత్రా వాహనాలు రాకుండా నాగమంగళం గ్రామస్తులు నిఘా కొనసాగిస్తున్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా సాగుతున్న గ్రామాల్లో అక్కడి స్థానికులు సైతం ఇసుక స్మగర్ల భరతం పట్టేందుకు సిద్ధమవుతున్నట్టు తెలియవచ్చింది.

నాయీ బ్రాహ్మణుల ఆందోళన

పలమనేరు: అనాదిగా తాము చేస్తున్న కులవృత్తిని ఇతరులు కూడా చేస్తుండడంతో తమకు అన్యాయం జరుగుతోందని, అన్య కులాలు వారు ఈ పనులు చేయకుండా చర్యలు తీసుకోవాలని పలమనేరుకు చెందిన నాయీ బ్రాహ్మణులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, పట్టణంలోని తాము నాయీ బ్రాహ్మణుల అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని కులవృత్తిపై ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నామన్నారు. అయితే బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి కొందరు వేరే కులస్తులు సైతం ఇక్కడ షాపులు నిర్వహిస్తూ తమ కడుపు కొడుతున్నారని పేర్కొన్నారు.
దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వీరికి బీసీ సంఘ నాయకుడు పూసల రవి సంఘీభావం తెలిపారు.

ఫ్యామిలి ఆసుపత్రిలో చిన్నపిల్లలను చేర్చకండి

– జిల్లా నాణ్యత అధికారి డాక్టర్ నిరంజన్‌రెడ్డి

పుంగనూరు: స్థానిక గోకుల్ సర్కిల్‌లోని ఫ్యామిలి ఆసుపత్రిలో చిన్నపిల్లలను చికిత్స నిమిత్తం అడ్మిట్ చేయరాదని, ఆ ఆసుపత్రికి అనుమతి లేదని జిల్లా నాణ్యత అధికారి డాక్టర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఎం అండ్‌హెచ్‌ఓ ప్రభావతి ఆదేశాల మేరకు పట్టణంలో చిన్నపిల్లల ఆసుపత్రులను తనిఖీ చేస్తున్నామని, ఫ్యామిలీ ఆసుపత్రిని తనిఖీ చేయగా..దీనికి అనుమతి లేదని తేలిందన్నారు. దీనిపై అనుమతి కోసం ఐదురోజుల్లో యాజమాన్యం దరఖాస్తు చేసుకోవాలని, లేనిపక్షంలో ఆస్పత్రిని సీజ్ చేస్తామన్నారు. అంతేకాకుండా ఆసుపత్రిని డే కేర్ క్లినిక్‌గా మార్చుకోవాలన్నారు.

గోవింద నామాలతో ర్యాలీ



పుంగనూరులో హిందూ జాగరణ సమితి నిర్వహిస్తున్న ర్యాలీ

పుంగనూరు: హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో పలువురు కాషాయ కండువాలు వేసుకుని, గోవింద నామాలు స్మరిస్తూ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం హిందూ జాగరణ సమితి సభ్యులు పరమేష్, వినాయక, వెంకటేష్, హేమంత్, త్రిమూర్తి రెడ్డి ఆధ్వర్యంలో వెంకట్రమణస్వామి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. సీఐ శ్రీనివాసులు కు వినతిపత్రం అందజేసి, తిరుమల ప్రసాదాలలో కల్తీకి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి అవకాశాలపై 2న అవగాహన సదస్సు

సదుం: గ్రామీణ యువతకు విద్యతో పాటు, ఉద్యోగ ఉపాధి నైపుణ్యావకాశాలపై అక్టోబర్ 2న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఫాతిమా-షరీఫ్ మంజిల్ ట్రస్ట్ సమన్వయకర్త కరీముల్లా మంగళవారం తెలిపారు. భట్టువారిపల్లెలో ఉదయం 9. 30 గంటల నుంచి నిర్వహించే సదస్సుకు 15-50 ఏళ్ల లోపు వారు పాల్గొనవచ్చని, పూర్తి వివరాలుకు 9490470699 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సంఘమిత్రను తొలగించకండి

ఎమ్మెల్యేకు మహిళల వినతి



పొలం పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

గంగవరం: తమ సంఘమిత్ర శీనను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని, తమకు అతడినే సంఘమిత్రగా కొనసాగించాలని ఎమ్మెల్యే ఎస్.అమరనాథరెడ్డిని మహిళలు కోరారు. మండలంలోని కీలపట్ల పంచాయతీలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అనంతరం వ్యవసాయ అధికారులతో కలిసి పొలం పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరించారు. బండమీదజరావారిపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే వద్దకు గ్రూపు మహిళలంతా కలిసి వెళ్లి పైవిధంగా సమస్యను నివేదించారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్ చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరాల కట్టడికి శ్రద్ధ వహించండి

-జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలో డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామాల్లో పారిశుధ్యం పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సచివాలయ సిబ్బందిని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం మండలంలోని తోటకనుమ పంచాయతీ గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, సీఎల్, మూవ్‌మెంట్ రిజిస్టర్లు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సచివాలయ సరీ్వస్ రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన పైవిధంగా మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయని లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

అక్రమ మద్యం అమ్మకాలు

సదుం: మండల కేంద్రంలో అక్రమ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధాన రహదారిలోని కొన్ని దుకాణాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారు. దుకాణాలలో తెచ్చిన మద్యాన్ని క్వార్టర్ బాటిల్ రూ. 30 నుంచి 50 వరకు అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం దుకాణాలలో స్టాకు అందుబాటులో లేకపోయినా వీరి వద్ద లభిస్తుండటం విశేషం! కొందరి సహకారంతోనే విక్రయాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి అక్రమ విక్రయాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

నాణ్యతా ప్రమాణాలు ముఖ్యం

-డీఈఓ దేవరాజులు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజులు

చౌడేపల్లె: మధ్యాహ్న భోజన పథకం మెనూలో నాణ్యతాప్రమాణాలను పాటించాలని డీఈఓ దేవరాజులు ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. విద్యాపరంగా వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, హెచ్‌ఎం నాగరాజారెడ్డి పాల్గొన్నారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి

-ఆర్జేడీ బాబు



పలమనేరు: ఎన్ఎస్ఎస్‌డేలో మాట్లాడుతున్న ఆర్జేడీ బాబు

పలమనేరు: విద్యార్థులు చదువుకుంటూనే మరోవైపు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని కడప ఆర్‌జేడీ, పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కళాశాలలో 56వ జాతీయ సేవా పథకం దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ,ఇక్కడి కళాశాలలో రెండు ఎన్ఎస్ఎస్ యూనిట్ల వలంటీర్ల సేవలు బాగున్నాయన్నారు. అనంతరం కళాశాలకు చెందిన విద్యార్థిని మానస ప్రి-రిపబ్లిక్‌డే పెరేడ్‌కు ఎంపికవడంపై అభినందించారు. అధ్యాపకులు చిదంబరం, నందీశ్వరయ్య, వాసు, నాగరత్నం రెడ్డి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ డేలో పలమనేరు హోమియో వైద్యురాలు గౌరిశ్రీ, విశ్రాంత హోమియో వైద్యులు మోహన్‌క్రిష్ణ మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ మధుసూదన్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దేవేంద్రరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం రూరల్: విద్యార్థి దశ నుంచే సేవాభావంతో ముందుకెళ్లాలని బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు అన్నారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నాగరాజు మాట్లాడారు. మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ డే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మహాత్ముడి సేవా మార్గంలో విద్యార్థులు పయనించాలని ఆయన కోరారు. ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

పుంగనూరు: శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బసవరాజ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ బహుమతులు అందజేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల మూలాన కలిగే అనర్థాలను వివరించారు. 7 రోజుల పాటు ఎన్ఎస్ఎస్ దినోత్సవాలు నిర్వహిస్తామని, విద్యార్థులతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రిన్సిపల్ చెప్పారు.కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ మురళీధర్, అధ్యాపకులు మోహనాచారి తదితరులు పాల్గొన్నారు.



గంగవరం: మాట్లాడుతున్న విశ్రాంత హోమియో వైద్యుడు మోహన్‌క్రిష్ణ



కుప్పం రూరల్: మొక్కలు నాటుతున్న విద్యార్థులు

రైతాంగ సమస్యల పరిష్కారానికే 'పొలం పిలుస్తోంది'



రొంపిచెర్ల: రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారులు



చౌడేపల్లె : గడ్డంవారిపల్లెలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ జ్యోతమ్మ



సదుం: వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ హరిప్రసాద్

– జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి

రొంపిచెర్ల: రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బోడిపాటివారిపల్లెలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలతోపాటు అరుతడి పంటలను కూడా రైతులు సాగు చేయాలని కోరారు. ప్రస్తుతం అదునుకు వర్షాలు కురుస్తున్నాయని, వేరుశనగ పంట సాగు చేయని రైతులు ఉలవ పంటను సాగు చేయవచ్చని, రాయితీపై ఇస్తున్న ఎరువులు, విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి సుధారాణి, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీధర్, మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి వెంకటరమణ నాయక్, రైతులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: వ్యవసాయంలో రైతులు ఆధునిక పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఏఓ జ్యోతమ్మ అన్నారు. మంగళవారం గడ్డంవారిపల్లె, పరికిదొన రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సమీపంలో రైతులు సాగుచేసిన వేరుశనగ, వరి పంటలను పరిశీలించారు. అక్కడే రైతులకు పంటల సాగు, యాజమాన్య పద్ధతులు, చీడ పీడల నివారణపై అవగాహ న కల్పించారు. రసాయనిక ఎరువుల వాడకంను తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని కోరారు. సెరికల్చర్ ఏఎస్ఓ రామిరెడ్డి, వీఏఏ ప్రభావతి, రైతులు పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: మండలంలోని చింతపర్తివారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పంటల సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించేలా అవగాహన కల్పిస్తామని ఏఓ హరిప్రసాద్ తెలిపారు. అనంతరం రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించి సూచనలు ఇచ్చారు.

మొరంలో..

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సహాయ సంచాలకులు అన్నపూర్ణదేవి రైతులతో మాట్లాడారు. చెన్నుపల్లెలో రైతు బాబు సాగు చేసిన మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే టమాట, ఆకుతోటల్లో చీడ పీడలపై రైతులు తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. మొ రంలో ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు ఘన జీవామృతాన్ని ఎలా చేయాలో ప్రదర్శనపూర్వకంగా తెలియజేశారు. వ్యవసాయాధికారిణి సంధ్యారాణి, వెటర్నరీ అధికారి సతీష్‌కుమార్, ఏఎంసీ అధికారిని జ్ఞానాంబ, రైతుసేవా సిబ్బంది ప్రేమ, జాహ్నవి,నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలోని కీలపట్ల రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. పుంగనూరు ఏడీఏ శివకుమార్ మాట్లాడారు. ప్రస్తుతం డ్రిప్ పరికరాలకు నమోదు చేస్తున్నామని, అవసరమైన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. పశు సంవర్ధక శాఖలో అమలవుతున్న పథకాల గురించి కీలపట్ల పశువైద్యాధికారి రెడ్డి ప్రియాంక రైతులకు వివరించారు. ఎంపీడీఓ మధుసూధన్‌రెడ్డి, ఏవో హేమలత, రైతులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: వివిధ పథకాలు, సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారిణి గీతాకుమారి కోరారు. మండలంలోని కమ్మనపల్లె, బేలుపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉద్యానవన శాఖలో మల్చింగ్, సబ్సిడీలు, సమీకృత దాణా..ఇత్యాది వాటిపై ఆమె మాట్లాడారు. వ్యవసాయశాఖ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలకు రిజిస్ట్రేషన్

పెద్దపంజాణి: 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాల ను రైతులకు అందజేసేందుకు రిజిస్ట్రేషన్ చేస్తున్న ట్టు పుంగనూరు సహాయ వ్యవసాయ సంచాలకు లు శివకుమార్ తెలిపారు. మండలంలోని చలమంగళం, లింగాపురం రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ఆయన మాట్లాడారు. గతంలో సబ్సిడీపై పరికరాలు తీసుకు ని ఏడేళ్లు పూర్తయినవారు కూడా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అర్హులేనన్నారు. సిఫారసు చేసిన మోతాదు మేరకే పంటలకు యూరియా వాడాలన్నారు. పట్టు పరిశ్రమ శాఖలోని స్కీమ్‌లు, సబ్సిడీల వివరాలను అసిస్టెంటు సెరికల్చర్ ఆఫీసర్ జీవీఆర్ చౌదరి వివరించారు. సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు, వీఏఏ అనిల్ కుమార్, మొహసిన్, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు: చెన్నుపల్లెలో..



గంగవరం: మాట్లాడుతున్న ఏడీఏ శివకుమార్